ప్రజావాణి



ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్ అధికారులు

కూకట్‌పల్లి: ప్రజావాణి కార్యక్రమంను పురస్కరించుకొని సైబర్ సిటీ సర్కిల్, కొండాపూర్ డివిజన్, బాలాజీనగర్ సెక్షన్‌లో కైత్లాపూర్ విలేజ్, రాఘవేంద్ర బస్తీలో శనివారం రంగారెడ్డి జోన్ సిజీఎం ఆనంద్, కొండాపూర్ డివిజనల్ ఇంజనీర్ గరుత్మంతు, కేపీహెచ్‌బీ ఏడీఈ వెంకటేశ్వర్లు, లైన్ ఇన్‌స్పెక్టర్ రవి, లైన్‌మెన్ రమణ, ఆర్టిజన్ వెంకటేష్‌లు పాల్గొన్నారు. వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకొని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కిడ్స్ ఎక్స్‌పో



మాదాపూర్: మాదాపూర్ హైటెక్స్‌లో నిర్వహిస్తున్న కిడ్స్ ఎక్స్‌పో సందర్శకులను ఆకట్టుకుంటుంది. ఎక్స్‌పోలో భాగంగా శనివారం 500 మంది చిన్నారులు ర్యాంప్ వాక్ చేశారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు ఆర్‌పి పట్నాయక్, నటి ప్రజ్ఞా నాయర్, బిగ్ బాస్ స్టార్ సని, నటి మృణాలినీరాథోడ్ పాల్గొన్నారు.

కొవిడ్ సేవలకు జిల్లా ఆస్పత్రి రెడీ

- 220 ఆక్సిజన్ బెడ్‌లు సిద్ధం
- వెంటిలేటర్లకు సర్వీసింగ్
- జాగ్రత్తలు తీసుకోవాలి: సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగినిరెడ్డి



కొండాపూర్ జిల్లా ఆస్పత్రి

గచ్చిబౌలి: కొవిడ్ కలకలం మళ్లీ మొదలైంది. జెఎన్-1 వెరియంట్ వేగంగా విస్తరిస్తుండటంతో జాగ్రత్తలు తప్పనిసరి అని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు రెండు పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఆ రెండూ శేరిలింగంపల్లిలోనే నమోదు కావడం గమనార్హం. కేంద్ర ఆరోగ్య విభాగం హెచ్చరికతో రాష్ట్ర ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో ఇప్పటికే రాపిడ్ యాంటిజెన్ టెస్టులు చేయడం ప్రారంభించారు.

ఐసోలేషన్ వార్డు

కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో సీఎస్‌ఆర్‌లో భాగంగా 250 ఎల్‌పీఎం , కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 500 ఎల్‌పీఎం ఆక్సిజన్ ప్లాంట్లు ఉన్నాయి.జెఎన్-1 వేరియంట్ విస్తరిస్తుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో మాక్ డ్రిల్ నిర్వహించారు. అత్యవసర సమయంలో ఆక్సిజన్ వాడుకునే వెసులుబాటు ఉంది. చిన్నారుల కోసం ప్రత్యేక వార్డులో 10 వెంటిలేటర్ బెడ్లు, పురుషులు, మహిళల కోసం వేర్వేరుగా మరో 20 వెంటిలేటర్లు ఏర్పాటు చేశారు. 220 బెడ్లకు ఆక్సిజన్ సౌకర్యం ఉంది. పాజిటివ్ వచ్చిన వారిని ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందించేందుకు డాక్టర్లు సిద్ధంగా ఉన్నారని సూరింటెండెంట్ డాక్టర్ అనురాగినిరెడ్డి తెలిపారు.

కిట్లు, మెడిసన్ రెడీ

కొవిడ్ పేషెంట్లకు సేవలందించేందుకు డాక్టర్లు, సిబ్బందికి పీపీఈ కిట్లు, ఎన్-95 మాస్కులు సిద్ధం చేశారు. పేషెంట్లకు ఇచ్చేందుకు యాంటిబయాటిక్, పారాసిటమోల్, ఇతర ట్యాబ్లెట్లు సిద్ధంగా ఉంచామని ఆర్‌ఎంఓ డాక్టర్ విజయకుమారి తెలిపారు. వెంటిలేటర్లు, ఆక్సిజన్ బెడ్లు ఉన్న వార్డులను ఆస్పత్రి వైద్యులు అనురాగినిరెడ్డి, విజయకుమారి, వరదాచారి పర్యవేక్షిస్తున్నారు.

జెఎన్-1 లక్షణాలు

జెన్-1 సోకిన వారిలో జలుబు, దగ్గు, బాడీ పెయిన్స్, జ్వరం లక్షణాలు ఉంటాయి. కొంతమందిలో దురద, వాంతులు కూడా అవుతాయి. ఈ లక్షణాలు ఉన్న వారు ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆస్పత్రులలో పరీక్షలు చేయించుకోవాల్సి ఉంది. నిర్లక్ష్యం తగదని మాస్కులు తప్పనిసరిగా ధరించాలని, కొవిడ్ లక్షణాలు ఉన్న వారు ఇంటికే పరిమితం కావాలని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.

ఈ వేరియంట్‌తో ప్రమాదం లేదు



ప్రస్తుతం జెన్-1 వేరియంట్ తొందరగా విస్తరించే అవకాశం ఉన్నప్పటికీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్ అనురాగిని రెడ్డి తెలిపారు. కొవిడ్ పేషెంట్ల కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 16 ఏళ్లలోపు పిల్లలు, 60 ఏళ్ల పైబడిన వారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఒకవైపు సీజనల్ వ్యాధులు, మరో వైపు జెఎన్-1 వేరియంట్ ఉండటంతో ఏ లక్షణాలో తెలియవన్నారు. ఎక్కువ రోజులు దగ్గు, జలుబు ఉంటే తప్పనిసరిగా కొవిడ్ టెస్ట్ చేసుకోవాలని సూచించారు.

– సూపరింటెండెంట్ డా.అనురాగిని రెడ్డి



చిల్డ్రన్స్ వార్డును పరిశీలిస్తున్న డాక్టర్లు అనురాగినిరెడ్డి, విజయకుమారి, వరదాచారి



కొండాపూర్ ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్

క్రిస్మస్ వేడుకలు



సంస్కృతి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చిన్నారుల సందడి

గచ్చిబౌలి: క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు సందడి చేశారు. శనివారం కొండాపూర్‌లోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఆట వస్తువులు, బుక్స్, మొక్కలు, సైకిల్స్, యూనిఫామ్స్‌ను పిల్లలకు తల్లిదండ్రులు బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో సంస్కృతి స్కూల్స్ చైర్మన్ మంగళారపు లక్ష్మణ్, డైరెక్టర్ భవాని, ప్రిన్సిపల్ సువర్చలాదేవి, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో గీతా జయంతి

పటాన్‌చెరు టౌన్: గీత పవిత్ర గ్రంథం అని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. శనివారం విద్యాభారతి పాఠశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గీతా జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు గీతా జయంతి ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు భగవద్గీత చదివేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల ఫౌండేషన్ డే



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని పవిత్ర ఇంటర్నేషనల్ స్కూల్ ఫౌండేషన్ డేను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్కూల్ చైర్మన్ ఎండ్లూరి వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సినీ నటుడు శివబాలాజీ మనోహర్, సోషల్ యాక్టివిస్ట్ రేఖారావులు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన క్లాసికల్, వెస్టన్ డ్యాన్స్‌లు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ భారతి ఎండ్లూరి, పవిత్ర స్కూల్స్ ప్రిన్సిపాల్స్ ఉషా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నల్లగండ్లలో..



వికాస్ ఎపిస్టిమో స్కూల్ విద్యార్థుల నృత్యాలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని వికాస్ ఎపిస్టిమో స్కూల్ ఆనందోత్సవం- కళాభిరామ దృశ్యం పేరిట వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా నెట్రోప్లస్‌కో ఫౌండర్ కమల్ షా, గౌరవ అతిథిగా సినీ దర్శకులు జాగర్లమూడి రాధాకృష్ణలు హాజరై శనివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపాల్ పద్మ కొల్లి మాట్లాడుతూ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు సంగీత, నృత్యాలతో ఆహుతులను అలరించారు. ఈ కార్యక్రమంలో స్వరాజ్యలక్ష్మి, అనిల్ చౌదరి, ఎస్ నందకిశోర్, వైస్ ప్రిన్సిపాల్ వాణి తదితరులు పాల్గొన్నారు.

గీతంలో 'హోమ్ కమింగ్'

పటాన్‌చెరు: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 'హోమ్ కమింగ్' పేరిట శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించింది. పూర్వ విద్యార్థులు కలుసుకుని తమ అనుభవాలను ఇతరులతో పంచుకోవడానికి దీనిని ఏర్పాటు చేశారు. ఆయా విభాగాల వారీగా విద్యార్థుల సమ్మేళనంతో ఆరంభమైంది. శివాజీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులంతా పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు వారి ఉత్సాహాన్ని రెట్టింపు చేశాయి.

ఆదర్శ రైతులకు సన్మానం

జిన్నారం(పటాన్‌చెరు): రైతు దినోత్సవం సందర్భంగా గుమ్మడిదల మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఆదర్శ రైతులను శనివారం గుమ్మడిదలలోని రైతు సంఘం భవనంలో సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, సర్పంచ్ నర్సింహారెడ్డిలు ఆదర్శ రైతులు, అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రైతులు నూతన పద్ధతుల ద్వారా పంటలను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమిస్తే చర్యలు: డీసీ కృష్ణయ్య



హైటెన్షన్ రహదారిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: హైటెన్షన్ రహదారిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కూకట్‌పల్లి డిప్యూటి కమిషనర్ కృష్ణయ్య హెచ్చరించారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న హైటెన్షన్ రహదారిలో అక్రమ నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేస్తుండటంతో స్థానికుల ఫిర్యాదు మేరకు జీహెచ్‌ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. గతంలో రహదారుల విస్తరణలో భాగంగా ప్రజా రవాణా సాఫీగా సాగేలా హైటెన్షన్ లైన్లో రహదారి నిర్మిస్తామని హామీ ఇవ్వటం జరిగింది. ఈ రహదారి విస్తరణలో కాలయాపన జరుగుతుండటంతో కొందరు భారీ షెడ్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగించటంతో జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. కార్యక్రమంలో ఏసీబీ సుస్మిత, టీపీఎస్ సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం ఢీకొన్న ఘటనలో..

తీవ్రగాయాలతో యువకుడు మృతి

పటాన్‌చెరు టౌన్: డీసీఎం స్కూటీని ఢీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకట్ రెడ్డి కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్, తిరుపతికి చెందిన సాయి తేజ(27) బతుకుదెరువు కోసం ఐడీపీఎల్ బాలానగర్‌కి వచ్చి పటాన్‌చెరు మండలం, పాశమైలారం పారిశ్రామికవాడలో పని చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం పని ముగించుకొని పాశమైలారం వైపు నుండి ఇస్నాపూర్ వైపు స్కూటీపై వస్తుండగా మార్గమధ్యంలో డీసీఎం ఢీ కొట్టింది. ఈ ఘటనలో డీసీఎం వెనుక టైర్ల కింద పడ్డ సాయి తేజ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శనివారం మృతుడి బావమరిది శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



గంగారం జాతీయ రహదారిపై బారికేడ్‌లు ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మియాపూర్ : రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేసి ట్రాఫిక్ అంతరాయం కల్గిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ పవన్ హెచ్చరించారు. చందానగర్‌లోని గంగారం జాతీయ రహదారిపై వాహనాలు అక్రమ పార్కింగ్ చేయకుండా బారికేడ్లను ఏర్పాటు చేసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాపింగ్‌మాల్స్‌కు వచ్చే ప్రజలు జాతీయ రహదారిపై వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయవద్దన్నారు. మాల్స్, వాణిజ్య సముదాయాల్లోనే పార్కు చేయాలని తెలిపారు. బారికేడ్లు దాటి జాతీయ రహదారిపై వాహనాలు పార్క్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళాలో భాగంగా శనివారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మృణాళిని శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. అలాగే సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ తంజావూర్ సౌజన్యంతో అస్సాం రాష్ట్రానికి చెందిన గౌతమ్‌కుమార్ దాస్ బృందం బిహు నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అన్నమయ్యపురంలో నృత్యార్చన

మాదాపూర్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా అన్నమయ్యపురంలో భక్తులు ఉదయం 5.30 గంటల నుంచి శ్రీ స్వరసిద్ధి వేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శనివారం శారద మ్యూజిక్ అకాడమి బృందంచే స్వరార్చన, సంధ్యారాజు(నాట్యం ఫేమ్) నృత్యార్చన, సాయి సన్నిది కూచిపూడి డ్యాన్స్ అకాడమి గురువు వి.రాధిక చే నృత్యార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాకారులు పలు అంశాలను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతిభ కళాశాల (సీఓఈ)ల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరడానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ గణేష్ తెలిపారు. జనవరి 15 చివరి తేదీ అని ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరి 4వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు. ఇంటర్‌తోపాటు జేఈఈ, మెడికల్ నీట్, ప్రవేశ పరీక్షలకు కూడా శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారని వివరించారు. అదేవిధంగా సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 5వ తరగతిలో చేరేందుకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదివే విద్యార్థులు జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ప్రజారోగ్య సమస్యలపై 'ప్రాశో' ప్రత్యేక దృష్టి



గచ్చిబౌలిలో 'ప్రాశో' కార్యాలయం ప్రారంభోత్సవంలో సంస్థ ప్రతినిధులు

గచ్చిబౌలి: అపారమైన సవాళ్ళను విసిరే ప్రజా ఆరోగ్య సమస్యల పట్ల 'ప్రాశో' ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య సలహాదారు ఆర్ గోవింద్‌హరి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి గచ్చిబౌలిలోని కావూరిహబ్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో ప్రాశో అనే స్వచ్ఛంద సంస్థ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. నగరంలో ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడానికి సంస్థ కృషి చేయనుంది. ప్రాశో అంటే నివారణ, ఆరోగ్యం, సాక్ష్యం-ఆధారిత ప్రాక్టీస్, వికలాంగులు, బలహీన సమూహాలకు మద్దతు ఇవ్వడం లాంటి కార్యక్రమాలు చేపడతారన్నారు. స్టాన్‌ఫోర్డ్ పరిశోధకులు ప్రొఫెసర్ జీవీఎస్‌మూర్తి మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో పరివర్తనాత్మక మార్పును తీసుకురావడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ కేర్ ప్రతినిధులు, నగరంలోని ప్రముఖ ఆస్పత్రుల డాక్టర్లు జెలా లెంటపెస్సే, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ జగన్నాథ్, డాక్టర్ రఘునాథ్, డాక్టర్ భాస్కర్ రావు, డాక్టర్ సలీల్, డాక్టర్ రామ్‌జీసింగ్, రఘునాథ్, డా.శివరంజనితోపాటు పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

ప్రజా పాలన కాంగ్రెస్‌కే సాధ్యం



పీజేఆర్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న జగదీశ్వర్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన చేస్తుందని, శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి బస్తీ, కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ,ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూస్తామని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ బస్తీలో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారం చూపే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భానుప్రసాద్, నాయకులు సాంబశివరావు, గోపాల్,రవి పాల్గొన్నారు.

ఈ ప్రాంత క్రీడాకారులకు గుర్తింపు తేవాలి

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ హాకీ అధ్యక్షుడుగా ఎన్నికైన కొండ విజయ్‌కుమార్‌ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ మన ప్రాంతానికి చెందిన హాకీ క్రీడాకారులకు గుర్తింపు వచ్చేలా కృషి చేయాలని, తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని చెప్పారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి

కిటకిటలాడిన వైష్ణవాలయాలు



భెల్ రామాలయంలో..



టెలికామ్‌నగర్‌లో.. ఏకాదశి పూజల్లో పాల్గొన్న భక్తులు

రాయదుర్గం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. స్వామి దర్శనానికి భక్తులు బారులుదీరారు.

ఉత్తర ద్వార దర్శనం

వైకుంఠ ఏకాదశి రోజున మాత్రమే తెరిచే ఆలయ ఉత్తరద్వార దర్శనంతో భక్తులు పులకించిపోయారు. తెల్లవారుజామునుంచే ఆలయాలలో స్వామి, అమ్మవారిని దర్శించుకొని ఉత్తర ద్వారం ద్వారా బయటకు వచ్చారు. నానక్‌రాంగూడ, గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి ఆలయం, రాయదుర్గం , వినాయక్‌నగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయం, జీపీఆర్‌ఏ క్వార్టర్స్ ఆలయం, గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రం, టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయం, ఇందిరానగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం, మధురానగర్, ఖాజాగూడ సాయిఐశ్వర్య కాలనీ, గౌలిదొడ్డి, ఎన్టీఆర్ కాలనీ, గోపన్‌పల్లితండా, కొత్తగూడ, కొండాపూర్‌లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే టెలికామ్‌నగర్‌లోని షిర్డీ సాయిబాబాకు లక్ష పూలతో పుష్పార్చన చేశారు.

భెల్ రామాలయంలో..

శేరిలింగంపల్లి: భెల్ ఎంఐజీలోని రామాలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం కల్పించడంతో భక్తులు పులకించిపోయారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో..

బలరాముని 9 అడుగుల విగ్రహం తిరుపతి నుంచి అయోధ్యకి తరలిస్తూ ఆలయానికి చేరుకోగా భక్తులు దర్శించుకున్నారు.

రేషన్‌కార్డుల కోసం ఎదురుచూపులు

మీ సేవ కేంద్రానికి క్యూ కడుతున్న ప్రజలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ కార్డులు ఇస్తామని హామీ ఇవ్వడంతో ప్రభుత్వం కొత్త రేషన్ కార్డు ఇస్తుందన్న ఆశలో ప్రజలు ఉన్నారు. ప్రభుత్వం సైతం ఈ నెల ఆఖరిలో రేషన్ కార్డుల ప్రక్రియను మొదలుపెడతామని చెప్పడంతో ప్రజలు దరఖాస్తు చేసుకునేందుకు మీ సేవ కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. నిత్యం మీ సేవ వద్దకు వందలాదిమంది వస్తున్నారు. అయితే రేషన్‌కార్డు దరఖాస్తునకు ఆ వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో మీసేవ నిర్వాహకులు వెనక్కి పంపిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేసే పలు సంక్షేమ పథకాలకు రేషన్ కార్డ్ అవసరం అవడంతో ప్రజలు రేషన్ కార్డుల కోసం క్యూ కడుతున్నారు. గతంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా చాలా మందికి రాకపోవడంతో నిరాశకు గురయ్యారు.

గత ప్రభుత్వ హయాంలో..

గత ప్రభుత్వంలో రేషన్ కార్డుల కోసం జిల్లా వ్యాప్తంగా 1,32,353 దరఖాస్తు చేసుకున్నారు. అందులో 69,631 దరఖాస్తులు ఓకే అవగా 14,977 దరఖాస్తులను తిరస్కరించారు. ఉప ఎన్నిక కారణంగా వెబ్‌సైట్ మూసి వేయడంతో 47,745 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.